క్లుప్తంగా

నేడు టీఏ, కార్యదర్శుల సమావేశం

కెరమెరి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం టీఏ, ఎఫ్ఏ, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మహేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ పనుల పురోగతి, ట్రాక్టర్ల బీమా వివిధ అంశాలపై సమీక్షా సమావేశం ఉంటుందన్నారు.

కాగజ్‌నగర్‌లో ప్రశాంతంగా టెట్

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్‌లోని పరీక్ష కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించిన టెట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద కోనేరు ట్రస్ట్ ఆధ్వర్యంలో జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు అభ్యర్థులకు అరటి పండ్లు పంపిణీ చేశారు. కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ రాచకొండ గిరికుమార్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వీవీ ప్రసాద్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సందడిగా భవానిగుట్ట జాతర


జాతరలో జన సందడి

వాంకిడి: మండలంలోని సరాండి గ్రామ శివారులో గల భవాని మాత గుట్ట వద్ద బడిగా పండుగ పురస్కరించుకుని శుక్రవారం జాతర నిర్వహించారు. జాతరకు పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో సందడి నెలకొంది. మండల ప్రజలతో పాటు మహారాష్ట్ర, వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. గుట్టపై వెలసిన భవానీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరలో ఎలాంటి ప్రమాదాలు, అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భద్రత చర్యలు చేపట్టారు.

'ప్రారంభానికి ఆహ్వానించకపోవడం సరికాదు'

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన మెడికల్ కళాశాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లాలోని పలు పార్టీల నాయకులను ఆహ్వానించకపోవడం సరికాదని బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు సతీశ్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో నిర్మించిన ఎస్పీ, సమీకృత కార్యాలయ భవనాలను ప్రజాధనంతో నిర్మించారని, వీటి ప్రారంభోత్సవానికి కేవలం టీఆర్ఎస్ నాయకులు తప్ప ఇతర పార్టీల నాయకులను పిలవకపోవడం సరికాదన్నారు.

జిల్లా కేంద్రంలో పందుల బెడద


పందుల స్వైర విహారం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని బజార్‌వాడీ హనుమాన్ ఆలయం ఆవరణలో పందులు విచ్చలవిడిగా సంచరిస్తుండడంతో కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు. వర్షాకాలం కావడంతో మెదడువాపు వ్యాధి సోకే అవకాశాలు ఉన్నందున పందుల బెడద లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆర్థిక అక్షరాస్యత సాధించాలి


మాట్లాడుతున్న అధికారులు

కౌటాల: ప్రతీ ఒక్కరు ఆర్థిక అక్షరాస్యత సాధించాలని టీజీబీ మేనేజర్ అజేశ్‌కుమార్ గేరా అన్నారు. శుక్రవారం మండలంలోని ముత్తంపేట గ్రామంలో గల గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బకాయి రుణాలు చెల్లించి తిరిగి రుణాలు పొందాలన్నారు. బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని కోరారు. బ్యాంకు పథకాలు, సేవలపై ఎంవీ జానపద కళాబృందం సభ్యులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆదే శ్రీనివాస్, నాయకులు బండు రావు, నరసింహులు, కళాజాత బృందం సభ్యులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చని చెట్లపై గొడ్డలి వేటు

- ఇష్టారాజ్యంగా వృక్ష సంహారం
- కరెంట్ తీగలకు అడ్డని చెట్లు తొలగిస్తున్న విద్యుత్ శాఖ
- పంటలు ఎదగడం లేదని వధిస్తున్న రైతులు
- మాయమవుతున్న పచ్చదనం


కౌటాల -మొగడ్‌దగడ్ రోడ్డు పక్కన మొదళ్లలో మంట పెట్టడంతో పడిపోయిన భారీ వృక్షం


కౌటాల -విజయనగరం రోడ్డులో..

కౌటాల: మండలంలోని ప్రధాన రోడ్ల వెంట ఏపుగా పెరిగిన చెట్లను కొంతమంది ఇష్టారాజ్యంగా తొలగిస్తున్నారు. భారీ వృక్షాలను సైతం నరికివేస్తుండడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏటా రూ.కోట్ల నిధులు ఖర్చు చేస్తూ ప్రభుత్వం హరితహారంలో భాగంగా మొక్కలు నాటుతోంది. ప్రతీ ఏడాది ఊరూరా కార్యక్రమాన్ని పండుగలా నిర్వహిస్తోంది. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వాములై పెద్ద సంఖ్యలో మొక్కలు నాటుతున్నారు. కానీ విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తగులుతున్నాయని విద్యుత్ అధికారులు, చేనుల్లో చెట్ల నీడ పడుతుందని రైతులు, ఇళ్ల ఎదుట చెట్ల ఆకులు రాలుతున్నాయని ఇళ్ల యజమానులు చెట్లను నరికేస్తున్నారు. దీంతో మొక్కలు నాటండి.. చెట్లు నరకండి అన్న చందంగా మండలంలో పరిస్థితులు తయారయ్యాయని పర్యావరణ ప్రేమికులు మండిపడుతున్నారు.

పట్టించుకోని అధికారులు..

కౌటాల - మొగడ్‌దగడ్ ప్రధాన రహదారిలో మండల కేంద్రానికి సమీపంలో జిన్నింగ్ మిల్లు, రైస్ మిల్లు ఉన్నాయి. వీటి సమీపంలో రెండు భారీ వృక్షాలు ఉండగా విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తాకుతున్నాయని విద్యుత్ అధికారులు ఓ చెట్టు నరికేశారు. మరో చెట్టు మొదళ్లలో గొడ్డలితో వేటు వేయడంతో భారీ వృక్షం ఎండిపోయింది. దాదాపుగా 25 ఏళ్ల క్రితం నాటిన చెట్లను పలువురు ఇష్టారాజ్యంగా నరికివేస్తున్నా, సంబంధిత అధికారులకు విషయం తెలిసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏటా కోట్లాది రూపాయలు వెచ్చించి హరితహారంలో భాగంగా పెద్దఎత్తున మొక్కలు నాటిస్తోంది. కాగా మండలంలో వివిధ కారణాలతో చెట్లను కొందరు ఇష్టారాజ్యంగా నరికివేస్తున్నారు. కొందరు చెట్ల మొదళ్లలో మంట పెడుతుండడంతో భారీ వృక్షాలు నేలకొరుగుతున్నాయి. రహదారుల వెంబడి ఒక శాఖ అధికారులు మొక్కలు నాటితే మరో శాఖ అధికారులు తొలగిస్తున్నారు.

జీపీలకు బాధ్యతలు

జిల్లాలోని రోడ్లకు రెండు వరుసలా మొక్కలు నాటి సంరక్షించే బాధ్యతలను జీపీలకు బదలాయించారు. అధికారులు లక్ష్యాన్ని చేరుకునేందుకు ఎక్కడపడితే అక్కడ మొక్కలు నాటుతుండడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. విద్యుత్ తీగల కింద చిన్న మొక్కలు, పూల మొక్కలు నాటాలనే నిబంధన విస్మరించి ఇతర మొక్కలు నాటుతుండడంతో అవి వృక్షాలవుతున్నాయి. ఏటా పెద్ద మొత్తంలో నిధులు వెచ్చించి నాటిన మొక్కలు.. వృక్షాలుగా మారిన తర్వాత నరికేస్తుండటంపై ప్రజలు మండిపడుతున్నారు. వేసవిలో నీడనిచ్చే, వాతావరణానికి మేలు చేసే చెట్లను నరికివేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. విద్యుత్ తీగల కింద పూల మొక్కలు మాత్రమే నాటేలా చూడాలంటున్నారు.

చెట్లను తొలగించొద్దు

కౌటాల -మొగడ్‌దగడ్ ప్రధాన రోడ్డుకు ఇరువైపులా గతంలో నాటిన మొక్కలు ప్రస్తుతం వృక్షాలయ్యాయి. చెట్లను తొలగించాలంటే అటవీశాఖ అధికారుల అనుమతి తప్పనిసరి తీసుకోవాలి. విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తాకుతున్నాయని చెట్లను నరకొద్దు. అనుమతులు లేకుండా చెట్లను తొలగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– ప్రభాకర్, ఎఫ్‌బీవో, కౌటాల

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె


నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

కాగజ్‌నగర్‌టౌన్: సమాన పనికి సమాన వేతనం కల్పించాలని మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు కాగజ్‌నగర్ మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులు చేపడుతున్న సమ్మె శుక్రవారం 12వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికులను ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించేంత వరకు ఉద్యమిస్తామని పేర్కొన్నారు.

'పాల్వాయి పురుషోత్తం సేవలు చిరస్మరణీయం'


నివాళులర్పిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: ప్రజాబంధు పాల్వాయి పురుషోత్తం సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మి అన్నారు. పాల్వాయి పురుషోత్తం రావు 24వ వర్ధంతిని పట్టణంలోని సర్‌సిల్క్‌లో గల స్వగృహంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రజా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు. అనంతరం నౌగాంబస్తిలో గల పురుషోత్తంరావు విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్‌లతో పాటు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

విశ్వహిందూ పరిషత్ నూతన కార్యవర్గం

కాగజ్‌నగర్‌టౌన్: విశ్వహిందూ పరిషత్ భజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు ఆధ్వర్యంలో శుక్రవారం కాగజ్‌నగర్‌లో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడిగా కోనేరు సీతారాం, బజరంగ్ దళ్ జిల్లా సప్తయిక్ మిలన్‌గా అంగల సన్నీ, కాగజ్‌నగర్ ప్రకండ విశ్వహిందూ పరిషత్ సహా కార్యదర్శిగా లక్ష్మీనారాయణ, బజరంగ్ దళ్ సంయోజక్‌గా విశాల్ పహేలని, సహా సంయోజక్‌లుగా కుమార్ తిల్వని, నాగోషా సాయి, టికం చెంద్ శర్మలను ఎన్నుకున్నారు. విశ్వహిందూ పరిషత్ భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో అక్టోబర్ 10న జోడేఘాట్‌లో యాత్ర ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 14న కాగజ్‌నగర్ పట్టణంలో ముగుస్తుందన్నారు.

గణేశ్ మండపాలకు అనుమతి తీసుకోవాలి

కౌటాల: వినాయక చవితి పురస్కరించుకుని వినాయకుడి విగ్రహాల మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు అనుమతి తీసుకోవాలని ఎస్సై ఎన్. మధుకర్ శుక్రవారం తెలిపారు. మండల పరిధిలో ఏర్పాటు చేయనున్న మండపాల ఏర్పాటుకు విద్యుత్ శాఖ అనుమతి, మైక్ పర్మిషన్ కోసం మీ సేవలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ నుంచి అనుమతి తీసుకుని, వివరాలను పోలీస్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల నిరసన

ఆసిఫాబాద్‌రూరల్: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సమగ్రశిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మె శుక్రవారం 19వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ సమగ్ర శిక్షలో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న తమకు సమాన పనికి సమానం వేతనం ఇవ్వాలన్నారు. మంత్రి మల్లారెడ్డికి వినతిపత్రం అందించారు.

విద్యార్థులకు సామగ్రి అందజేత

రెబ్బెన: మండలంలోని కొత్త పులికుంట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం అదే గ్రామానికి చెందిన బుర్స అంజి, బుర్స రవిలు వారి పుట్టినరోజు సందర్భంగా విద్యాభ్యాసన సామగ్రిని విరాళంగా అందజేశారు. పాఠశాలకు చెందిన 25 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, లాంగ్ నోట్‌బుక్‌లు, స్కేళ్లు, పెన్నులు, పలకలు అందజేశారు.

నత్తనడకన పనులు!

- ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని రైల్వే వంతెన
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు


నిర్మాణ దశలో ఉన్న రైల్వే వంతెన

సిర్పూర్(టి): రైల్వే వంతెన నిర్మాణం ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు పూర్తి కాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సిర్పూర్(టి) -కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై సిర్పూర్(టి) మండలం వేంపల్లి రైల్వేగేటు వద్ద నూతనంగా నిర్మిస్తున్న రైల్వే వంతెన పనులు ఏళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. నియోజకవర్గంలోని నాలుగు మండలాల ప్రజలతో పాటు మహారాష్ట్రకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో ఈ మార్గంలో నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. రైల్వేగేట పడిన ప్రతీసారి ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చూడాల్సిన సంబంధిత అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

గంటల తరబడి ఎదురుచూపులు

నియోజకవర్గంలోని సిర్పూర్(టి), కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాల ప్రజలతో పాటు సిర్పూర్(టి), చింతలమానెపల్లి మండలాల మీదుగా మహారాష్ట్రకు వెళ్లే ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. అత్యవసర సమయాల్లో వైద్యం కోసం కాగజ్‌నగర్‌కు వెళ్లే రోగులు పడే బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. రైల్వేగేటు మరమ్మతు పనులు తరుచూ జరుగుతుండడం, రైల్వే ప్రధాన లైన్ కావడంతో ఒకేసారి రెండు, మూడు రైళ్లు వస్తే గంటల తరబడి రైల్వేగేటు వద్ద ప్రయాణికులు వేచి చూడక తప్పని పరిస్థితులు కన్పిస్తున్నాయి. మరోవైపు అప్రోచ్ రోడ్డు పూర్తిగా గుంతలమయం కావడంతో వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు.

2016లో నిధులు మంజూరు..

వేంపల్లి రైల్వేగేటు వద్ద రైల్వే వంతెన నిర్మాణానికి 2016లో రూ. 20 కోట్ల నిధులు మంజూరయ్యాయి. వంతెన నిర్మాణ పనులు ప్రారంభించిన అనంతరం అటవీశాఖ అనుమతులు లేవంటూ నోటీసులు జారీ కావడంతో పనులు నిలిపివేశారు. తిరిగి అనుమతులు పొంది పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా వంతెన నిర్మాణ పనులు మాత్రం పూర్తి కావడం లేదు. అధికారులు స్పందించి పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వేగంగా పూర్తి చేయాలి



వేంపల్లి రైల్వే గేటు వద్ద వంతెన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. వంతెన నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలి.

– బంద సంజీవ్‌కుమార్, సిర్పూర్ (టి)

తిప్పలు తప్పడం లేదు



రైల్వే గేటు పడుతుండడంతో గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితులు ఉన్నాయి. వంతెన నిర్మాణ పనులు ప్రారంభమై ఏళ్లు గడుస్తున్నా పూర్తి చేయడం లేదు. అత్యవసర సమయాల్లో, రాత్రి వేళల్లో ఈ రహదారి గుండా వెళ్లే ప్రయాణికుల ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి.

– ఎల్ముల్తే కిషోర్, సిర్పూర్ (టి)

'సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం'


వాంకిడి: నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ టీచర్లు


కెరమెరి: నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు

కెరమెరి: అంగన్‌వాడీలకు ఉన్న డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చేవరకు పోరాటం ఆగదని అంగన్‌వాడీలు, హెల్పర్లు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న సమ్మె శుక్రవారం ఐదోరోజుకు చేరుకుంది. సీఐటీయూ నాయకుడు కూటికల ఆనంద్, అంగన్‌వాడీలు ప్రవంతి, అనసూయ, గుణసుందరి, మంజుల, సావిత్రి, రాధా, చంద్రకళ, సరోజ, లూర్ద మేరి, అమలేశ్వరి, తాయిబాయి, హెల్పర్లు రజిత, సుమిత్ర, రేణుక, జనాబాయి, బూదేవి ఉన్నారు.

వాంకిడిలో..

వాంకిడి: తమ సమస్యలు పరిష్కరించాలని పలు డిమాండ్లతో అంగన్‌వాడీ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. 5వ రోజు సమ్మెలో భాగంగా శుక్రవారం ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

కౌటాలలో..

కౌటాల: అంగన్‌వాడీ ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు వెలిశాల క్రిష్ణమాచారి డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా ఐదోరోజు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట కళ్లకు నల్లగుడ్డలు ధరించి నిరసన తెలిపారు. సమ్మెలో సీఐటీయూ నాయకులు మోరేశ్వర్, నాగేశ్, అంగన్‌వాడీ టీచర్లు హేమలత, జీజాబాయి, శ్యామల, వనిత, భాగ్యజ్యోతి, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో..

కాగజ్‌నగర్‌టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ వర్కర్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె శుక్రవారం 5వ రోజుకు చేరుకుంది. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలు, ఆయాలను పర్మినెంట్ చేయాలని పేర్కొన్నారు.

వైద్య శిబిరాలకు విశేష స్పందన


వైద్య శిబిరంలో పాల్గొన్న మిల్లు ప్రతినిధులు

కాగజ్‌నగర్‌రూరల్: స్పర్శ ఫౌండేషన్, ఎస్పీఎం మిల్లు ఆధ్వర్యంలో మండలంలోని అందవెల్లి గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఎస్పీఎం మిల్లు జనరల్ మేనేజర్ ఎంఎస్ గిరి మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల నిర్మూలనకు వైద్యశిబిరం నిర్వహించినట్లు తెలిపారు. డాక్టర్ భానుప్రకాశ్, మిల్లు వైద్యసిబ్బంది గ్రామంలోని ప్రజలకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు. మిల్లు ప్రతినిధులు తుమ్మ రమేశ్, సర్పంచ్ మెకర్తి గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

మాజీ ఎమ్మెల్యే పాల్వాయి పురుషోత్తంరావు 24వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం మండలంలోని కడంబా గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో 250 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఎముకల వైద్యనిపుణులు డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు, వైద్యులు శ్రావణ్‌కుమార్, లోకేష్‌లు పరీక్షించారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ రాజేశ్వరిరాజు, మాజీ జెడ్పీటీసీ మల్లయ్య, ఎంపీటీసీ మోతిరాం, నాయకులు తిరుపతి అశోక్, రామయ్య, మారయ్య, రాకేశ్, రమేశ్, మురళి, బానయ్య, శేఖర్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'బడుగా'!


ఆసిఫాబాద్‌అర్బన్: అలంకరించిన కట్టె బొమ్మల ఎద్దులతో చిన్నారులు

కెరమెరి: పొలాల అమావాస్య తర్వాత జరుపుకునే బడుగాను మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ శివారుల్లో ఉన్న జమ్మిచెట్లకు పూజలు జరిపారు. యువకులు, చిన్నారులు తమ మార్కోళ్లను చెట్టు వద్ద విడిచిపెట్టారు. అనంతరం మర్రి, తెల్లమద్ది, తదితర మొక్కలను ఇళ్లకు తీసుకెళ్లారు. ఆయా మొక్కల పొగతో జ్వరం వంటి రోగాలు తగ్గిపోతాయని ప్రజలు విశ్వసిస్తుంటారు.

కౌటాలలో..

కౌటాల: మండలంలోని రైతులు, ప్రజలు శుక్రవారం బడుగా పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ పండుగ సందర్భంగా రైతులు మట్టితో ఎద్దులు తయారు చేసి స్థానిక చెరువుల్లో, వాగుల్లో నిమజ్జనం చేశారు. ఇళ్లల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మట్టి ఎద్దుల విగ్రహాలను నృత్యాలు చేస్తూ ఊరేగించారు.

ఉత్సాహంగా తానా పొలాల పండుగ

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో శుక్రవారం చిన్నారులు తానా పొలాల పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. కట్టె బొమ్మలతో తయారు చేసిన ఎద్దులకు ప్రత్యేకంగా పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. పిండి వంటలతో తయారుచేసిన నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం బ్రహ్మణవాడ గణేశ్ మందిర్, పండరినాథ్ ఆలయం వద్ద నుంచి అంకమరాజు ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. గాంధీచౌక్ అంకమరాజు ఆలయం వద్ద పూజలు నిర్వహించారు.

ఘనంగా ఇంజనీర్స్ డే


రెబ్బెన: ఇంజనీర్లను సన్మానిస్తున్న సభ్యులు

ఆసిఫాబాద్: మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో ఎస్ఈ వాసుదేవ్‌ను విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది శాలువాతో సన్మానించారు.

రెబ్బెన: దేశ ప్రగతిలో ఇంజనీర్ల పాత్ర ఎంతో కీలకమని లయన్స్ క్లబ్ ఆఫ్ గోలేటి స్పోర్ట్స్ డైరెక్టర్ మహేందర్ అన్నారు. శుక్రవారం బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీలో ఇంజనీరింగ్ డేను ఘనంగా నిర్వహించారు. సీహెచ్‌పీ ఉత్తమ ఇంజనీర్లు డీజీఎం భీంరావ్ జాడే, సీహెచ్‌పీ ఇంజనీర్లు రాజు, ఎలక్ట్రికల్ ఇంజనీర్ శ్రావణ్, మెకానికల్ ఇంజనీర్ శ్రీధర్‌లను లయన్స్ క్లబ్ సభ్యులు శాలువాలతో సన్మానించారు. లయన్స్ క్లబ్ సభ్యులు రాజన్న, సీహెచ్‌పీ ఉద్యోగులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ జెడ్పీటీసీ మృతి


చంద్రయ్య (ఫైల్)

రెబ్బెన: మండలంలోని ఎడవెల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ కార్నాథం చంద్రయ్య (60) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆసిఫాబాద్‌లో నూతనంగా నిర్మించిన మెడికల్ కళాశాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి మండల బీఆర్ఎస్ నాయకులతో వెళ్లిన ఆయన జిల్లా కేంద్రంలోనే గుండెపోటుతో కుప్పకూలారు. వెంటనే మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైదులు నిర్ధారించారు. ఎడవెల్లి గ్రామంలో చంద్రయ్య పార్థివ దేహాన్ని ఎమ్మెల్సీ దండె విఠల్, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కులు సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

నార్నూర్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని హెల్త్ సూపర్‌వైజర్ చరణ్‌దాస్ చౌహాన్ అన్నారు. శుక్రవారం మహగావ్‌లో ఇంటింటికీ తిరిగి యాంటి లార్వా సర్వే చేపట్టారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా:
9010608462
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ :
తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.విజయకుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899